# రొట్టె కోసం

బారెడు ప్రొద్దెక్కింది.

చటుక్కున లేచి కూర్చున్నాడు. రంగడు రాత్రల్లా 'ఆకలి ఆకలి' అని ఏడిచి ఎప్పుడు నిద్రపోయింది కూడా రంగడికి గుర్తులేదు. తెల్లవారి లేచేసరికి మళ్ళీ ఆకలే.

గుడిసెలో ఒకమూల జ్వరంతో మూలుగుతూ ముడుచుకు పడుకున్న తల్లి వంక కోపం, జాలి, కసి మిళితమైన చూపుతో లేచి బయటకు వచ్చేడు.

"ఒరే! రంగా! ఏడికిరా పోతుండవు" అంటూ నీరసంగా పిల్చింది తల్లి.

"యాడికా? ఏట్లోకి"అంటూ విసురుగా గుడిసె దాటి రోడ్డుమీాదకు వచ్చేడు రంగడు.

ఆ వేసవికాలపు ప్రొద్దుటెండలోకి ఖాళీ కడుపుతో

వచ్చి నిల్చునేసరికి కళ్ళుతిరిగినట్టయింది రంగడికి. ఎలాగో నిలద్రొక్కుకున్నాడు.

"అరే! రంగడొచ్చిండురా!" అంటూ అరచేడు గోలీకాయ లాడుతున్న ఎల్లిగాడు నర్సిముతో.

రంగడు ఓసారి వాళ్ళవంక చూసేడు. వాళ్ళిద్దరూ అలా నిశ్చింతగా గోలికాయలాడుతుంటే ఆ పదేళ్ళ మనసులో అసూయలాంటి భావం మెదిలింది.

ప్రతిరోజూ వాళ్ళలాగా తానుకూడా ఆడేవాడు. కాని మూడురోజులనుండి పంపునీళ్ళు తప్ప తన కడుపులో యింకేమీ పడలేదు. అందుకే యిప్పుడు కళ్ళు తిరుగుతున్నయ్. వళ్ళు తూలుతోంది. ఎల్లిగాడి తండ్రి రిక్షా లాగుతాడు. మనిషి దృఢంగా బలంగా ఉంటాడు. రిక్షా లాగగా వచ్చిన డబ్బులలో రిక్షా కిరాయికి, త్రాగుడికి పోగా నాలుగైదురూపాయలు ఇంట్లో ఖర్చులకి యిస్తాడు. అందుకే ఎల్లిగాడికి ఆకలిబాధ తెలియదు.

నర్సిములు తండ్రి ఏదో ఆఫీసులో చప్రాసీ...తన నేస్తులందరిలోకి తనే బీదవాడు. తన తండ్రికూడా రిక్షా లాగుతాడు. కాని సన్నగా బలహీనంగా ఉంటాడు. రోజుకు రెండు మూడు సవారీలకంటె ఎక్కువ తొక్కలేడు. వచ్చిన కాస్త డబ్బు రిక్షా కిరాయికి, గుడంబాకే సరిపోతుంది. ఎప్పుడైన మిగిలితే పావలా అర్ధా తప్ప ఎక్కువ యివ్వడింట్లో. తల్లి రెండిళ్ళలో అంట్లు తోమి నెలకు యిరవైరూపాయలు

సంపాదిస్తుంది. పదిరోజులనుండి తల్లి పనికి పోవటంలేదు. జ్వరంతో మూలుగుతూ పడుకుంటోంది.

తండ్రి రాత్రి ఏపదింటికో తప్పతాగి యింటికి వస్తాడు. వచ్చిన దగ్గరనుండి తిండి కడుపునిండా పెట్టలేదని పెళ్ళాన్ని చావబాదుతాడు. ఆమెకి జ్వరం వచ్చినదగ్గరనుండి ఆ కోపాన్ని రంగడిమీాదకు చూపుతున్నాడు.

తల్లి జ్వరం వచ్చినదగ్గరనుండి రెండు బన్నులు కొనుక్కు వస్తున్నాడు తండ్రి. అందులో ఒకటి తల్లికి పెట్టి రెండవది తను తింటున్నాడు. మూాడురోజులనుండి బన్నుకూడా లేదు. ఆకలితో కడుపు మాడినప్పుటల్లా వీధిలోని పంపు నీళ్ళతో చల్లార్చుకుంటున్నాడు.

రాత్రి భరించలేక బిగ్గరగా ఎడ్చేడు రంగడు. తల్లి మూలుగుతూనే అనుకుంటుంది తండ్రి అయిపులేదు. తాగి ఏ కల్లు పాకలో పొర్లుతున్నాడో!

ఎదుట లేని తండ్రిని బండ బూతులు తిట్టేడు రాత్రి రంగడు. ఏడ్చి ఏడ్చి అలిసిపోయి నిద్రపోయేడు.

"ఏరా రంగడు! వత్తావా" అని ఆటలోకి పిలుస్తున్నాడు ఎల్లిగాడు.

రంగడు మాట్లాడకుండా కొద్దిక్షణాలు నిల్చున్నాడు.

తరువాత మెల్లిగా ఎల్లిగాడిదగ్గరకు వెళ్ళి "మీా యింట్లో వణ్ణం ఉందా!" అనడిగేడు.

"వణ్ణంలేదు గాని రొట్టెలున్నయ్" అన్నాడు ఎల్లిగాడు.

"నాకోరొట్టె తెచ్చిపెడ్తావా! ఆకలేత్తోంది. దీనంగా అడిగేడు రంగడు. నాలికతో పెదవులు తడుపుకుంటూ.

ఎల్లిగాడు రంగడి ముఖంలోకి చూసేడు. ఆకలిబాధ అంతిమస్థాయిని చేరుకున్న ఆ ముఖంలోని దైన్యాన్ని చూస్తుంటే ఎల్లిగాడుకి మనసు దేవినట్లయింది. కాని వెంటనే కఠోరమైన వాస్తవికత మనసులోని మృదుత్వాని నలిపివేసిందిసి.

"అమ్మో! నేను కనుక రొట్టె తెచ్చేనంటే మా అమ్మ సంపేత్తది" అన్నాడు ఎల్లిగాడు.

రంగడు మాట్లాడకుండా అక్కడనుండి కదిలేడు.

ఆకలితో రంగడి కడుపు మండిపోతుంది. అభిమానంతో అతని మనస్సు దహించుకుపోతుంది. ఉక్రోషంతో గుండె కంపించిపోతోంది.

పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నాడు రంగడు. బండిమీద మిగల పండిన అరటిపళ్ళు పెట్టుకునికూర్చున్నాడు రహీం దాదా. అరచి గీపెట్టినా పైసలు లేకుంటే ఒక్క పండివ్వడు పిల్లలకు. పళ్ళు పాడైపోతే మూసీనదిలో పారవేస్తాడు. రహీం దయా ధర్మాలు అనే పదాలు వ్యాపార నిఘంటువులో ఉండకూడదని అందరు వ్యాపారస్థుల్లానే అతను కూడా గాఢంగా నమ్ముతాడు.

రంగడికి నాలిక పిడచగట్టుకుపోతోంది. ఏమైనాసరే ఒక్క రొట్టె ముక్కన్నా తినందే మంచినీళ్ళన్నా ముట్టుకోకూడదని గట్టిగా నిశ్చయించుకున్నాడు రంగడు.

బేగంబజారు చౌరస్తా దాటగానే చటుక్కున నిల్చిపోయాడు రంగడు. రోడ్డుకి రెండువైపుల పాతకాలంనాటి ఎత్తయిన భవనాలు తరతరాలుగా సమాజంలో ప్రేళ్ళు పాతుకపోయిన ధనస్వామ్య వ్యవస్థకు, కరడుగట్టిన మూఢ విశ్వాసాలకు ప్రతినిధులుగా నిలబడి ఉన్నయ్. ఆ భవనాలలో కుల, మత, భాషా భేదాలు లేకుండా ఎన్నోరకాల కుటుంబాలు జీవిస్తున్నారు. ఐతే వారందరూ వృత్తిరీత్యా ఒకే మనస్తత్వాన్ని ఒకేరకమైన జీవన విధానాన్ని ఒకేరకమైన నమ్మకాలను ఏర్పరచుకున్నవారు. వారివృత్తి వ్యాపారం ఒక్క నయాపైసని వందరూపాయిల నోటుగా మార్చగల చాకచక్యం, పాన్ పూరి అమ్ముకుంటూ పదంతస్తుల మేడకట్టే ప్రతిభ ఆ కుంటుంబాలలో పుట్టిన పసిపాపలందరికీ ఉగ్గుపాలతోనే అలవడతాయ్.

ఆ భవనాలక్రింద ఫుట్‌పాత్ మీాద శరీరానికి ఆచ్ఛాదన కూడ లేకుండా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, యాచనతో బ్రతికే ప్రాణులు ఎన్నో ఉన్నాయ్. కాని వారి మీాదకు పొరపాటునకూడా ఆ అదృష్టజాతకుల దృష్టి ప్రసరించదు.

రంగడు ఫుట్‌పాత్ మీాద నిల్చుని ఎత్తయిన అరుగు

లున్న యింటిగుమ్మంలోకి తొంగిచూసేడు. ఆ యిల్లు రెండు బట్టల దుకాణాలకు యజమానియైన సింధీఆయనిది. ఆయన తల్లి వితంతువు. ఏభై యేళ్ళ వయసుంటుంది. ఆ సింధీ తల్లి శరీరం చాలా తెల్లగా ఉంటుంది. అంతకంటే తెల్లనిబట్టలు కట్టుకుంటుంటుంది ఆమె. కాని ఆమె ముఖంలోని భావాలు మాత్రం దానికి వ్యతిరేకమైన రంగులో ఉంటాయని రంగడి అభిప్రాయం.

సగంపైగా నెరసిన తల వెంట్రుకలతో, తెల్లని బట్టలతో ఆమె స్థూలకాయాన్ని కదిలించుకుంటూ నడుస్తుంటే రంగడు ఎప్పుడూ భయంతో కూడిన ఆశ్చర్యంతో ఆమె వంక చూస్తుంటాడు.

ఆ సింధి వితంతువు రోజు సరిగ్గా ఉదయం ఎనిమిది గంటలకు 'నాస్తా' చేయగా మిగిలిన రొట్టెలు తీసుకువచ్చి అరుగుమీాద పెడుతుంది కాకులకోసం. ఆ రొట్టెలను ముక్కును కరచుకుని ఎగిరి వెళ్ళి దగ్గరలో ఉన్న రావిచెట్టుమీాద కూర్చుని తింటాయ్.

రంగడు ఎలాగైనా ఆ రొట్టెలు కాకులపాలుకాకుండా లాగేసుకోవాలని ఆలోచించుకుంటూ, లోపలనుండి వచ్చే నేతిరొట్టెల వాసనను పీలుస్తూ నిల్చున్నాడు.

పావుగంటసేపు నిరీక్షించిన తరువాత సింధి స్త్రీ రొట్టెలతో బయటకు వచ్చింది. రంగడు ఆశగా రొట్టెలవంక చూచి చెయ్యి జాపాడు.

ఆమె వాడివంక గుడ్లురిమి చూచి "జావ్ జావ్ బద్మాష్" అంది కఠినంగా.

ఇంతలో ఆమెను చూచి 'కావ్ కావ్' మని అరుస్తూ నాలుగు కాకులు వచ్చినాయ్. ఆమె చేతిలోని రొట్టెలను నాలుగుముక్కలు చేసి అరుగుమీద వేసింది. క్షణంలో ఆ రొట్టెముక్కలు, కాకులు కూడా మాయమైనాయ్.

ఆమె మరోసారి వాడివంక కరుకుగా చూచి సింధీయాసతో కూడిన హిందీలో "యహాఁక్యోం ఖడేజావ్" అంటూ గర్జించి దభీమని తలుపులు మూసేసుకుంది. ఈ మనుష్యులకు పశుపక్ష్యాదులమీద ఉండే ప్రేమ, కరుణాలలో కనీసం సగమైనా తోటిమనుషులమీద ఉంటే ఎంతబాగుండును! అనుకున్నాడు రంగడు.

నీరసంగా మరో పదడుగులు ముందుకు వేసేడు. మెడికల్ షాపు యజమాని భగవాన్‌సింగ్ యింటిదగ్గరకు రాగానే అతనికాళ్ళు నిలిచిపోయినయ్.

గుమ్మానికి కొంచెం అవతలగా నేలమీద చతికిలపడి కూర్చుని స్టీలుపళ్ళెంలో వేడివేడి రొట్టెలు పెట్టుకొని పెరుగులో నంచుకుతింటోంది ఆ రేళ్ళపాప. ఆ దృశ్యాన్ని చూసేక ఇంక రంగడికి అడుగు ముందుకు పడలేదు.

పళ్ళెంలోని రొట్టెవంక పాపముఖంవంక మార్చి మార్చి చూసేడు రంగడు.

అతనిలోని ఆకలి రొట్టెలను చూస్తూనే పదింతలై

విజృంభించింది. ఈ బజార్లో ఇంతమంది కడుపునిండా అజీర్తి చేసేలా తింటుంటే తనొక్కడే మూడురోజులుగా ఒక్క మెతుకైనా ముట్టకుండా పస్తులపడుతున్నానన్న భావం అతనిలో అగ్నిలా రాజుకుని భగభగ మండసాగింది.

వెనక ముందు ఆలోచించకుండా ఒక్క అంగలో పాప మీద కలయబడి రంగడు రొట్టెల పళ్ళెం చేజిక్కించుకోవటం పాపకెవ్వున ఏడవటము, పక్కనే వంటింట్లో కూర్చుని 'నాస్తా' చేస్తూ, పాపను కంట కనిపెడుతూ కూర్చున్న ఆమె తల్లిదండ్రులు చటుక్కున బయటకు రావటము అంతా క్షణాల్లో జరిగిపోయింది.

"వెధవా! స్టీలుపళ్ళెం ఎత్తుకుపోదామని వచ్చేవా?" అంటూ పాపతండ్రి రంగడి డొక్కలో ఒక గుద్దుగుద్దేడు. "చూస్తారేం? ఇంక తన్నండి చంపండి వెధవని వేలెడున్నాడో లేదో యిప్పట్నుంచే వీడికి దొంగబుద్ధులు. ఎంత ధైర్యం! ఎంత ధైర్యం. అసలే అలకాజాతివాళ్ళంతా అంతే! పుట్టానే దొంగబుద్ధిని వెంటపెట్టుకుని మరీ వస్తారు భూమ్మీదకు" అప్పటికే రోడ్డుమీద పోయే జనం గుంపుగా పోగై తలా నాలుగుమాటలూ అని, అంతకు పదిరెట్లు దెబ్బలు వేసి రంగడిని యీడ్చి ఫుట్‌పాత్ మీదకు తోసేసేరు.

అకలిబాధకు దెబ్బలబాధ తోడుకాగా కళ్ళు తిరిగి బోర్లాపడ్డ రంగడి మెదడులో తప్పతాగి పెళ్ళాం పిల్లలను

బోర్లాపడ్డ రంగడి మెదడులో తప్పతాగి పెళ్లాం పిల్లలను బాదే తండ్రి, జ్వరంతో మూలుగుతూ పడుకున్న తల్లి, కాకులకు రొట్టుముక్కలు పెట్టే ధర్మదాత సింధీస్త్రీ, తన చుట్టూ గుమిగూడి చూపులతో, మాటలతో తన యెడల తిరస్కారాన్ని జుగుప్సను చూపుతున్న ప్రజలు - అందరూ స్వప్నంలోని మనుష్యుల్లా అస్పష్టంగా కదుల్తున్నారు.

—:—